విద్యుత్ కోతలపై రైతుల ఆగ్రహం



నెక్కొండ: అలంకానిపేట విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు



గీసుకొండ: కొనాయమాకుల సబ్‌స్టేషన్ ఎదుట నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

- అలంకానిపేట విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట రైతుల ఆందోళన
- కొనాయమాకులలో కాంగ్రెస్ ధర్నా

నెక్కొండ : సమయం, సందర్భం లేకుండా విద్యుత్ కోతల విధింపుపై రైతులు ఆగ్రహించారు. అప్రకటిత విద్యుత్ కోతలతో దిగుబడిపై ప్రభావం ఉంటుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని అలంకానిపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ కోతలను నిరసిస్తూ.. ఆదివారం రైతులు రోడ్డెక్కారు. సబ్ స్టేషన్ ఎదుట (నెక్కొండ -కేసముద్రం ప్రధాన రహదారిపై) ఆందోళనకు దిగారు. వారం రోజులుగా విద్యుత్ సరఫరా ఎప్పుడు ఉంటుందో? తెలియని రైతులు పంట చేన్ల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొందని ఆరోపిస్తున్నారు. గతేడాది యాసంగిలో 24 గంటల కరెంటు ఉండేదని ఈ సారి కూడా కరెంటు సరిపడా ఉంటుదని భావించామని కానీ ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్రీఫేజ్ విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడంతో యాసంగిలో పంటలు వేయాలా వద్దా.. అనే అయోమయంలో ఉన్నామని వారు వాపోయారు. కళ్లేదుటే వేసిన పంటలకు నీరందక ఎండి పోతున్నాయని వారు పేర్కొన్నారు. రాత్రి వేళల్లో ఎప్పుడు కరెంటు వస్తదో.. రాదో తెలియని అయోమయంలో ఉన్నామని రైతులు చెబుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు సంఘటన స్థలికి రావాలంటూ.. రైతులు నినాదించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలికి వచ్చారు. నెక్కొండ విద్యుత్ శాఖ ఏడీఈ ఐలయ్య రైతులకు నచ్చజెప్పేందుకు యత్నించారు. ఈ సందర్భంగా ఏడీఈ రైతులతో మాట్లాడుతూ.. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి విద్యుత్ సమస్యలుండవని అన్నారు. ప్రస్తుతం పూర్తి స్థాయిలో విద్యుత్ ఇవ్వలేక పోతున్నామని చెప్పారు. రెండు, మూడు రోజుల్లో కరెంటు కొరత తీరనుందన్నారు. ఎప్పటిలాగాలనే యథావిధిగా 24 గంటల విద్యుత్‌ను వ్యవసాయానికి అందిసామని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. ఏడీఈ హామీతో రైతుల ఆందోళన విరమించడంతో ఎక్కడిక్కడ నిలిచి వాహనాలు కదిలాయి. ఈ ఆందోళనలో రైతులు రాంపెల్లి శ్రావణ్‌కుమార్, గాజుల కరుణాకర్, మంగిశెట్టి రాజేశ్వర్, లక్కకుల సంతోష్, ఆకుల ఉప్పలయ్య, నీలం ఎలేందర్, గాజుల కృష్ణ, మాదాసు రామ్మూర్తి, ఇరుసోడ్ల శ్రీధర్, ఎడ్ల సందీప్, మాదాసు వెంకటేష్, మంగిశెట్టి ప్రవీణ్, మైల యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలకు వ్యతిరేకంగా ర్యాలీ

సంగెం : విద్యుత్ కోతలకు వ్యతిరేకంగా మండలంలోని తీగరాజుపల్లిలో ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆదివారం ఏఐకేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎండి. ఇస్మాయిల్ ఆధ్వర్యంలో తీగరాజుపల్లి ఎన్టీఆర్ చౌరస్తా నుంచి సబ్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు తెలియకుండా రాత్రిపూట త్రీఫేజ్ సరఫరా ఇవ్వడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు ఎండిపోతున్నాయని దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చెబుతున్న ప్రకారం కరెంట్ సరఫరాను పగటిపూట అందించాలని లేకుంటే ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గోనే రామచంద్రు, ఎనబోతుల సాంబయ్య, రౌతు శ్రీనివాస్, దూడయ్య, రవి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



నెక్కొండ: రైతులతో మాట్లాడుతున్న ఏడీఈ ఐలయ్య



సంగెం: తీగరాజుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

ఏసీడీ చార్జ్‌ని ఉపసంహరించాలి

గీసుకొండ : మండలంలోని కొనాయమాకుల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వ్యవసాయానికి అందించే విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతోంది. దీంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతూ ఇబ్బందులు పడుతున్నారంటూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఆ పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. సబ్‌స్టేషన్ ఎదుట బైఠాయించి 24 గంటల పాటు అంతరాయం లేకుండా కరెంటు సరఫరా చేయాలని , అడిషనల్ కన్‌సంప్షన్ డిపాజిట్(ఏసీడీ) వసూలు చేయడాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఈ సంపత్‌రెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. విద్యుత్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని, లేదంటే తమ ఆందోళనను తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఎంపీపీ బీమగాని సౌజన్య, కాంగ్రెస్ జిల్లా నాయకులు చాడ కొమురారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తుమ్మనపెల్లి శ్రీనివాస్, జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షులు బొంపెల్లి దేవేందర్‌రావు, నియోజకవర్గ కోకన్వీనర్ బొమ్మనపెల్లి అశోక్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నాగారపు స్వామి, ప్రధాన కార్యదర్శులు అప్పని కరుణాకర్, కూసం రమేశ్, యూత్ అధ్యక్షుడు రుద్రారపు ప్రసాద్, సాంబరెడ్డి, వజ్రరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆటో డ్రైవర్లకు లైసెన్స్ మేళా



కాజీపేట : కాజీపేట చౌరస్తాలో మన తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రైవింగ్ లైసెన్స్ మేళాను ఆదివారం 60వ డివిజన్ కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ ప్రారంభించారు. డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా ఉన్న ఆటో డ్రైవర్లు దరఖాస్తు పత్రాలు నింపి కార్పొరేటర్‌కు అప్పగించారు. కార్పొరేటర్లు సంకు నర్సింగ్, ఎలకంటి రాములు, ట్రాఫిక్ ఎస్సై నాగరాజు, ఈసంపల్లి సంజీవ్, మల్లేశం, శ్రీధర్ రెడ్డి, ఎండి ఖాజా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న రజిత

హసన్‌పర్తి : అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ జక్కుల రజిత అన్నారు. 55వ డివిజన్ బ్యాంక్‌కాలనీ రోడ్-11లో సుమారు రూ.10లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆదివారం రజిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లోని అన్ని కాలనీల్లో రోడ్లు, మురుగు కాల్వలు నిర్మిస్తానన్నారు. కాలనీ వాసులు ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనదృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, డివిజన్ అధ్యక్షుడు అటికం రవీందర్, కార్యదర్శి నాయకపు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సంగాల చిన్న, దేవస్థాన ధర్మకర్త భరత్, యూత్ అధ్యక్షుడు సాయికుమార్, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు రాయకంటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం



కాజీపేట అర్బన్ : కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఆదివారం ఖురాన్ పఠనం పూర్తి చేసిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. సర్వ మతాల సారాంశం ఒక్కటేనని ముఖ్య అతిథిగా హాజరైన మూల్వి మహమ్మద్ రియాసుద్దీన్ తెలిపారు. పాఠశాలలలో అన్నదమ్ముల్లాగా కలిసి ఉండాలని, ఉన్నత లక్ష్యాన్ని సాధించడమే లక్ష్యంగా చదువుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ జిల్లా విజిలెన్స్ ఆఫీసర్లు మహమ్మద్ అంజద్, యాకూబ్ పాషా, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలి



కాజీపేట : అనాథలకు విద్యా, ఉద్యోగ అవకాశాల్లో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించడంతో పాటు ఖర్చును ప్రభుత్వమే భరించాలని బహుజన సోషలిస్టు పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంద కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం కాజీపేట చౌరస్తాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నేడు (సోమవారం) ఇందిరా పార్క్‌లో ఏర్పాటు చేసిన అనాథ అరిగోస దీక్షను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో చిలువేరు ఆశీర్వాదం, జన్ను దినేష్, మంద రాజు, బండారి సురేందర్, గద్దల కుమార్, అక్కినకుంట వెంకటస్వామి, రేనుకుంట్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



నడికూడ : మండలంలోని నర్సక్కపల్లి గ్రామానికి చెందిన బండి ప్రవీణ్ ఇటీవల విద్యుద్ఘాతానికి గురై మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ ఆదివారం ఆర్థికసాయం చెక్కు అందించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడారు. పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రాంరెడ్డి ఆదేశాల మేరకు ప్రవీణ్ కుటుంబానికి ఇనుగాల ట్రస్ట్ చెక్ అందించినట్లు తెలిపారు. పేద కుటుంబాలకు పార్టీ, ఇనుగాల ట్రస్ట్ అండగా నిలుస్తోందని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కుమారస్వామి, రాజు, విజేందర్, పాపిరెడ్డి, ప్రశాంత్, సేరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

రాయపర్తి : మండలకేంద్రం నుంచి పెర్కవేడుకు వెళ్లే రహదారిలో ఇరువైపుల నిర్మిస్తున్న సైడ్ డ్రెయినేజీ పనులను ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ ఆదివారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ డ్రెయినేజీ పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామపార్టీ అధ్యక్షుడు ముద్రబోయిన సుధాకర్, చందు రాము తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా స్త్రీశక్తి భవనం

- ఇరుకు గదుల్లో విధులు
- పట్టించుకోని పాలకులు,అధికారులు



నిరుపయోగంగా స్త్రీశక్తి భవనం

దుగ్గొండి : అన్నిహంగులతో నిర్మించిన భవనం అది.. ఉపాధిహామీ, ఐకేపీ అధికారుల విధుల నిర్వహణ కోసం సకల సౌకర్యాలు ఉన్నాయి. కానీ, నేటికి ఆ భవనానికి వేసిన తాళం తీయలేదు..దీంతో స్త్రీశక్తి భవనం నిరుపయోగంగా ఉంటోంది. మండల కేంద్రంలో మహిళా స్వయం సహాయక సంఘాల నిర్వహణ కోసం లక్షల రూపాయలు వెచ్చించి భవనాన్ని నిర్మించారు. నిర్మాణం పూర్తి అయి ఏళ్లు గడుస్తున్నా నేటికి ఉపయోగించిన దఖాలాలు లేవు. ఫలితంగా భవనం కాస్తా నిరుపయోగంగా ఉండి ఉత్సవ విగ్రహంలా మారిపోయింది.

మండల కేంద్రంలో మహిళా స్వయం సహాయక సంఘాల నిర్వహణ, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిర్వహణ కోసం ప్రభుత్వం 2015సంవత్సరంలో భారత నిర్మాణ రాజీవ్‌గాంధీ సేవాకేంద్రం పేరుతో రూ.32 లక్షలు మంజూరు చేసింది. కాగా, అప్పటి ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ పనులకు శంకుస్థాపన చేశారు. ఏళ్లు గడిచాయి, మూడేళ్ల క్రితమే పనులు పూర్తి అయ్యాయి.. ఏడాది క్రితం రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖామంత్రి కేటీఆర్ నర్సంపేటలో వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. అయినా నేటికి వేసిన తాళం తీయలేదు. దీంతో అధికారులు ఎవరు భవనాన్ని ఉపయోగించుకోవడానికి ముందుకు రావడం లేదు.

ఇరుకు గదుల్లోనే నిర్వహణ

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఏపీఓ, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్‌లు ఇలా 100మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఎంపీడీఓ కార్యాలయం పైన ఒక గదిలో మాత్రమే అన్నీ రకాలు పనులు చేసుకుంటున్నారు. సర్వ హంగులతో నిర్మించిన భవనాన్ని వదిలి ఇరుకుగదిలో ఉండటం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల నిర్వహణ కోసం మండల పరిషత్ కార్యాలయాల భవన సముదాయంలో ఓ బిల్డింగ్ ఉండటంతో వారు అక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో ఏమీ అర్థం కావడం లేదని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

రెండు విభాగాలు ఉపయోగించుకోవాలి



స్త్రీశక్తి భవనంలో స్వయం సహాయక సంఘాల నిర్వహణ, ఉపాధి హామీ పథకం నిర్వహణ చేయాలి. గతంలో ప్రశాంతి మండల సమాఖ్య భవనం ఉండటంతో అక్కడే విధులు నిర్వర్తిస్తున్నాం.ఉపాధి పథకం నిర్వహణలో భాగంగా రికార్డులు భద్రపరుస్తున్నట్లు తెలిసింది. అయితే పూర్తిస్థాయిలో వాడకంలో లేని మాట వాస్తవం.

-గుజ్జుల రాజుకుమార్, ఏపీఎం

గీతకార్మికుల సంక్షేమమే లక్ష్యం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న గౌడ జేఏసీ ప్రతినిధి మండ వెంకన్న

ఖిలా వరంగల్ : గీతకార్మికుల సంక్షేమమే గౌడ జేఏసీ లక్ష్యమని, అందుకు గౌడ సంఘాలు ఐక్యమత్యంతో కలిసికట్టుగా ఉండాలని రాష్ట్ర జేఏసీ నేత బొనగాని యాదగిరిగౌడ్, జనగాం వెంకన్న, పులి శ్రీనివాస్, కార్పొరేటర్ పోశాల పద్మ, స్వామిగౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం వరంగల్ కరీమాబాద్ రోడ్డులోని ఆదర్శ పరపతి సంఘం భవనంలో మండ వెంకన్న గౌడ్ అధ్యక్షతన గౌడ సంఘాల జేఏసీ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వారు హాజరై మాట్లాడారు. స్వరాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో గౌడ కులస్తుల ముందున్నారని, నేడు ఆర్థిక, రాజకీయ, సామాజికంగా వెనకబడటం జరుగుతుందని అన్నారు. జనాభాలో సుమారు 18శాతం ఉన్న గౌడ కులస్తులకు రాష్ట్ర బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యత దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గౌడ వృత్తిలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి త్వరలోనే గౌడ జేఏసీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ఇందుకు గౌడలంతా ఒకతాటి మీదకు రావాలని వారు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మార్క రవి, అనంతుల రమేష్‌గౌడ్, గట్టు రమేష్, మండ శ్యామ్, గొడిశాల సూరజ్, న్యాయవాది కూనూరు రంజిత్ గౌడ్, సందీప్, విజయ్, రామనాథం, బలరాం, కుమారస్వామి, వెంకటస్వామి, కత్తి సాంబయ్య, రాజుగౌడ్, చందు తదితరులు పాల్గొన్నారు.

చెరువుగుంతలో పడి పశువుల మృతి

గూడూరు: మండలంలోని చిన్న ఎల్లాపురం శివారు హాముతండా సమీపంలోని తుమ్మలకుంట చెరువు గుంతలో పడి రెండు పాడి పశువులు ఆదివారం మృతిచెందాయి. బాధిత రైతు శంకర్ తెలిపిన వివరాల ప్రకారం పొలం దున్నిన తర్వాత రెండు పాడి పశువులను సమీపంలోని చెరువులో శుభ్రం చేయడానికి వాటితోపాటు వెళ్లాడు. కానీ చెరువు శిఖం సమీపంలో ఓ పెద్ద గుంత నిండ నీరు ఉండడంతో ప్రమాదవశాత్తు రెండు పాడి పశువులు అందులో పడి మృతిచెందాయి. సుమారు రూ.80 వేల విలువ చేసే పాడి పశువులు గుంతలో పడి మృతిచెందడంపై బాధితులు బోరున విలపించారు. అధికారులు గుర్తించి ఆర్థిక సహాయం అందించాలని వేడుకున్నారు.

నూతన కమిటీ ఎన్నిక

పరకాల : ఆరె సంక్షేమ సంఘం పరకాల పట్టణ కొత్త కమిటీని స్థానిక అమరధామంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నాగుర్ల శ్రీనివాసరావు, ఇజిగిరి రాజేందర్ ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా లాసాని నర్సింగరావు, తిప్పారపు రాము, కోశాధికారిగా కాత్మండి సాంబశివరావును, సలహాదారులను ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు ఎడ్డె రమేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాగుర్ల నాగేశ్వర్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి అడగాని జనార్ధన్‌రావు, కోశాధికారి వాడికారి శివాజీ, వీరాబాయి, రాధాబాయి పాల్గొన్నారు.

అగ్రంపహాడ్‌లో ముందస్తు మొక్కులు



మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ఆత్మకూరు : మండలంలోని అగ్రంపహాడ్ సమ్మక్క -సారలమ్మ తల్లులకు జాతరలో భక్తులు ఆదివారం ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. ఫిబ్రవరి 1 నుంచి 5 వరకు మినీ అగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మ జాతర జరగనున్న నేపథ్యంలో భక్తులు ఆదివారం సమ్మక్క-సారలమ్మలను దర్శించుకుని పూజలు నిర్వహించారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు ఈఓ శేషగిరి తెలిపారు.

మాజీ సైనికుడికి ఉత్తమ జవాన్ అవార్డు

నడికూడ : మండలంలోని పులిగిల్ల గ్రామానికి చెందిన మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బిట్ల వేణుగోపాల్ నేతకు వెటర్నర్ వరంగల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి చేతుల మీదుగా ఆదివారం ఉత్తమ జవాన్ అవార్డు అందజేశారు. హనుమకొండలోని ఆదర్శ లా కాలేజ్‌లో జరిగిన అసోసియేషన్ సిల్వర్ జూబ్లీ కార్యక్రమంలో వేణుగోపాల్‌ను నారాయణరెడ్డి అవార్డు అందించి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ కరుణాకర్, కోశాధికారి రమేష్, మాజీ సైనికులు పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారుల ఎంపిక



క్రీడాకారులతో అసోసియేషన్ నాయకులు

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని జాగృతి హైస్కూల్‌లో జోనల్ స్థాయి క్రీడాకారుల ఎంపిక ఆదివారం నిర్వహించారు. జోనల్ అసోసియేషన్ అధ్యక్షుడు కంది కృష్ణ చైతన్య రెడ్డి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు మీస అరవింద్ క్రీడాకారులకు పలు సూచనలు చేశారు. అనంతరం జోనల్ టీంను ప్రకటించారు. ఎంపికైన వారిలో యువరాజ్, ప్రకాష్, అజయ్, రాబట్, ప్రవీణ్‌కుమార్, విష్ణువర్ధన్, శివప్రసాద్, గణేష్, వంశీ, శివ ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో రాణించాలన్నారు. క్రీడాకారులకు తన ప్రోత్సాహం ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు మహ్మద్ రఫీ, వ్యాయామ ఉపాధ్యాయులు కందుల స్వామి, గాదెపాక బాబు, నాయకులు కంది రవిచైతన్య, ననుమాస సాయి, అశోక్‌రెడ్డి, కిరణ్, రాజు, విక్రమ్ ఉన్నారు.

మన్‌కీ బాత్ వీక్షణ



టీవీలో మోదీ మన్‌కీ బాత్ ప్రసంగాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

వర్ధన్నపేట : ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీ బాత్ ప్రసంగాన్ని ఆదివారం టీవీల్లో బీజేపీ నాయకులు వీక్షించారు. వర్ధన్నపేట పట్టణంలోని మూడో వార్డు కౌన్సిలర్ కొండేటి అనిత సత్యం స్వగృహంలో ఆదివారం జిల్లా నాయకులు, మండల నాయకులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గాడిపెల్లి రాజేశ్వర్‌రావు, పెద్దూరి రాజు, ఐత రవికుమార్, కొండేటి సత్యం, వెలమకంటి గిరిప్రసాద్, కొండేటి బాబు, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నివాళులర్పిస్తున్న గోగుల రాణాప్రతాప్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామానికి చెందిన శ్రీగురుకుల పాఠశాల కరస్పాండెంట్ మోతె సమ్మిరెడ్డి సతీమణి మోతె జయమ్మ(70) ఆదివారం మృతిచెందారు. కాగా, నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి జయమ్మ భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ కళావతి పద్మనాభరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ మోతె జయపాల్‌రెడ్డి, టీఆర్‌ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో మాజీ కారోబార్ మృతి

చెన్నారావుపేట : మండలంలోని బాపునగర్ గ్రామానికి చెందిన మాజీ కారోబార్ అజ్మీరా హుమ్లు(57) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందాడు. కాగా, మృతదేహంపై ఆదివారం ఎంపీపీ బాదావత్ విజేందర్, మాజీ ఎంపీపీ జక్క అశోక్, సర్పంచ్ బాదావత్ మంగమ్మ, మేగ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌ఎస్ నాయకులు భూక్యా లింగనాయక్, గ్రామపార్టీ అధ్యక్షుడు డప్పు వీరన్న, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

నర్సంపేట : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నర్సంపేట ఫొటోగ్రాఫర్‌లు ఓడెల కల్యాణ్, కొంపెల్లి శివకోటి చిత్రపటాలకు నర్సంపేట నియోజకవర్గ నాయకుడు డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాలకు రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖానాపురం బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు గుడిపూడి రాధాకృష్ణ, మహ్మదాపురం పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాలడుగుల జీవన్, ఉపసర్పంచ్ నెదురు రాజేందర్, గురిజాల వార్డు సభ్యులు ఆముదాల రమేష్, ఇజ్జగిరి అశోక్, ద్వారకపేట బీజేపీ యూత్ నాయకులు వరంగటి వెంకటేష్, గూడెపు రంజిత్, గోగుల సందీప్, నర్సంపేట ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నినాదాలు చేస్తున్న ప్రభాకర్ తదితరులు

మామునూరు : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం సమష్టిగా కృషి చేద్దామని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బన్న ప్రభాకర్ సూచించారు. ఆదివారం ఖిలా వరంగల్ మండలం నక్కలపల్లి గ్రామంలో మన్నె బాబురావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమి చేశారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి కొబ్బరికాయలు కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ ఆర్థికవేత్త, న్యాయకోవిదుడు రాజనీతిజ్ఞుడు, అంటరానితనం వివక్షపై అలుపెరుగని పోరాటం చేసిన యోధుడన్నారు. మహనీయుడిని ప్రతిఒక్కరూ గుర్తించుకునేందుకు నక్కలపల్లి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. అదే విధంగా అంబేడ్కర్ ఆలోచనలను ఆచరణలో పెడితే మానవుడే మహనీయుడవుతాడని చెప్పారు. కార్యక్రమంలో రవిప్రసాద్, రామ్‌చందర్, హరిప్రసాద్, తిరుపతి, రాములు, నర్సింగరావు, కిష్టయ్య, సాంబయ్య, బన్న రాజశేఖర్, రాకేష్, మధు, మహేష్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

ఆత్మకూరు : బీఆర్‌ఎస్‌లో పని చేసే కార్యకర్తలందరికీ తగిన గుర్తింపు ఉంటుందని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో పరకాల మండలంలోని వెల్లంపల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో ఆదివారం చేరారు. ఈ సందర్భంగా వారికి వినయ్‌భాస్కర్, ధర్మారెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో యువతకు పెద్దపీట వేస్తామన్నారు. యువకులు ఉత్సాహంతో పార్టీ బలోపేతానికి పాటుపడాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు.